మినీకథ:

విపంచి




# జేబులో డబ్బులు

ఆ రోజు ఆఫీసుకి రాగానే త్రిమూర్తి చాలా దిగులుగా అన్నాడు: "గొప్ప ప్రమాదం నుంచి బయట పడ్డానోయ్!"

"ఏం, దార్లో ఏ రచయిత అయినా కన్పించాడా?" క్రీ గంట నాకేసి చూస్తూ, విశ్లేషించాడు వెంకట రమణ.

ఈ ప్రపంచంలో రచయితల్ని మించిన ప్రమాదకర మైన వాళ్ళెవ్వరూ లేరని అతనికో ప్రగాఢ నమ్మకం. రచయిత అనగా పీడించువాడని, హింసించువాడని అతని డిక్షనరీ అర్థం. ఇదే కాదు, ఇంకా వెంకట రమణకి బోల్డన్ని సొంత థీరీలున్నాయి.

వెంకట రమణ జోక్‌కి నవ్వలేదు త్రిమూర్తి. దాంతో అతను నిజంగానే ఏదో ప్రమాదం నుంచి బయటపడ్డాడని నిశ్చయించుకున్నాను. కాకపోతే, ఇంతకీ ఆ ప్రమాదం ఏమిటో నా కర్థం కాలేదు.

నేను ఆలోచనతో తల బద్దలు కొట్టుకోకుండానే అసలు సంగతి చెప్పాడు త్రిమూర్తి. ఆఫీసుకి వస్తూ, బస్సు దిగి, ఎదురుగా వున్న హోటల్లోకి వెళ్ళాను. టిఫెన్ శుభ్రంగా చేసేసిన తర్వాత, సర్వర్ మూడు న్నర బిల్లు యిచ్చిన తర్వాత చూసుకొన్నాను.

కౌంటర్ దగ్గరకి వెళ్ళి, జేబులో చెయ్యి పెట్టేసరికి ఏముంది? బిల్లు! ఎవడో దొంగవెధవ సిటీ బస్సులో నా జేబు కత్తిరించేసాడు. ఉన్న కాసిని డబ్బులు కాస్తా 'చోరార్పణం' అయిపోయాయి. ఆ జేబులో వున్న డబ్బులు తప్ప, నా దగ్గర మరో పైసా లేదు.

పర్సు పోయిందయ్యా అంటే వినిపించుకోడే ఆ హోటల్ ప్రొప్రయిటర్? 'చొక్కా తీస్తావా, పిండి రుబ్బుతావా' అన్నాడు. "చచ్చాననుకో-ఏం చెయ్యాలో తోచలేదు.

అంతలోనే దేవుడు పంపించినట్లు 'శ్రీహరి' కన్పించి నా బిల్లు చెల్లించాడు. తృటిలో తప్పింది అపాయం!" పూర్తి చేశాడు త్రిమూర్తి, నిట్టూరుస్తూ.

వెంకటరమణ సిగరెట్ పొగ స్టయిల్‌గా వదుల్తూ, "నాకు తెల్సు మన బస్సుల్లో, రైళ్ళల్లో ఈ జేబు కత్తిరింపులనేవి మామూలే! ఈ పదునైన బ్లేడ్ల వల్ల మనమెప్పుడో ఓసారి ప్రమాదంలో పడొచ్చు. ఇప్పుడు మన త్రిమూర్తి చిక్కుకున్నట్లే!

ఒక్కొక్కసారి మనల్ని కాపాడటానికి ఏ 'శ్రీహరులు', సుబ్బారావులు రాకపోవచ్చు. అప్పుడు మనమేం చెయ్యాలి? ఏం చేస్తాం?

అందుకే నేను ఉపాయం ఆలోచించా. మనదగ్గిర ఓ ఇరవై రూపాయిలున్నాయనుకో. నాలుగు అయిదులుగా మార్చుకొని, నాలుగు జేబుల్లో పెట్టుకున్నామనుకో!

ఓ జేబుపోతే పోయింది! అప్పుడు రెండో జేబు మనల్ని రక్షిస్తుంది. ఎలా వుంది నా ఐడియా?" అన్నాడు.

త్రిమూర్తి నోరు అంతవరకూ తెరుచుకున్నవాడల్లా దోమ లోపలికి వెళ్ళటానికి ప్రయత్నించడంతో నోరు మూసుకుంటూ, అన్నాడు: "అద్భుతం!"

"అదీ! ఈ వెంకటరమణ అంటే ఏమనుకున్నావు? అభినవ ఐన్‌స్టీన్! సాపేక్ష సిద్ధాంతం, మీకు డైలీ లైఫ్‌లో పనికి రాకపోవచ్చు గాని, నా ఈ నాలుగు జేబుల సిద్ధాంతం మీకు నిత్య జీవితంలో వుపయోగపడు తుంది" అన్నాడు సగర్వంగా నవ్వేస్తూ.

మా కొలీగ్స్ అందరూ 'వెంకటరమణ'ని ఆకా శానికి ఎత్తేసారు.

ఆ మరుసటి రోజు-

నేను, వెంకటరమణ కలిసి, ఫస్ట్‌షో సినిమాకెళ్ళాం! టికెట్లు తీసుకోబోతూ, జేబులో చెయ్యిపెట్టాడు వెంకటరమణ.

జేబు అప్పటికే కత్తిరించబడి వుంది.

డబ్బులు పోయాయని ఏ మాత్రం బాధ పడలేదు వెంకటరమణ.

పైగా నవ్వాడు. "నేను నిన్నే చెప్పానుగా! దేశంలో జేబు దొంగల్కు ఎక్కువని! ఇప్పుడు అదే నాకు నిజమై కూర్చుంది. నా ముందు జాగ్రత్తైన నాలుగు జేబుల సిద్ధాంతం మనకి సహాయపడుతుంది" అని ఇంకో జేబులోంచి అయిదు రూపాయలు తీసి, టిక్కట్టు కొన్నాడు.

ఆశ్చర్యపోయాను.

వెంకటరమణ యింత అద్భుతంగా ఆలోచిస్తాడని నేనెప్పుడూ అనుకోలేదు. వాడి వుపాయమేదో బాగానే వున్నట్లుందే అనుకున్నాను.

సినిమా విడచిపెట్టిన తర్వాత మేమిద్దరం సర్దాగా కబుర్లు చెప్పుకొంటూ, నడుచుకుంటూ రాసాగాం.

మళ్ళీ తన నాలుగు జేబుల సిద్ధాంతం గురించి మరో సారి 'ప్రోగ్రామ్' పెట్టాడు.

సహనంగా విన్నాను.

ఓ వారం రోజులు గడిచాయి.

వెంకటరమణ, నేను కలిసి నడుచుకుంటూ వెళ్తుంటే, మా ప్రక్కగా వెళ్ళింది ఓ సైకిల్.

సైకిల్ తొక్కుతున్న గిరజాల జుట్టు కుర్రాడు, వెనక కూర్చున్న అతనితో చెబుతున్నాడు "ఈ మధ్య నా అదృష్టం పండింది గురూ! వూళ్ళో పిచ్చి సన్నాసులు ఎక్కువైపోయారు.

వాడెవడో నాలుగు జేబుల్లో డబ్బులు పెట్టుకుం టు న్నాడు. ముందు జాగ్రత్త అట! ఇదివరకైతే, అంతా మన అదృష్టం మీద ఆధారపడి వుండేది. ఇప్పుడలా కాదు, ఏ జేబు కత్తిరించినా మన పంట పండుతుంది-డబ్బులుంటున్నాయి.

వెంకటరమణ వైపు తిరిగాను.

అతని ముఖం నాకా క్షణాన అప్పారావ్ హోటల్లోని మాడిపోయిన పెసరట్టును గుర్తుకు తెప్పించింది. *